# పి.వి. రమణ

# పులి-మేక




ప్రథమ ఘట్టం.

చలమయ్యకు ఆ రాత్రంతా కంటిపై కునుకు లేదు. మనసులో మందు గుండ్లు పేలుతుంటే బితుకు బితుకు మంటూ పై కప్పు కేసి చూస్తూ వుండి పోయాడు. సమస్యల సమరంలో, యుక్తి కుయుక్తుల వ్యూహాన్వేషణలో నలిగి అతని నరాలన్నీ పురి విడిన దారాల్లా పుటుక్కు మనేట్లున్నాయి. తెల్లవార్లూ ఎడ తెగకుండా కొన సాగిన ఆలోచనల ఆటుపోటుల రాపిడికి ఆవిరై పోయిన అతని మనస్సుకు ఉదయానికేదో ఇంత ఆసరా దొరికింది. ఆత్రంగా లేచాడు. ఆవు రావురు మంటూ కాలకృత్యాలు ముగించాడు. నడి మింటికి జేరి ఇంటిల్లి పాదినీ తన చుట్టూ చేర్చాడు ఇంత కూడు బెట్టటం తప్ప మరో ఆలోచన, అవసరం లేని ముద్దుల భార్య దేవమ్మను చూస్తూ అన్నాడు చలమయ్య!

"ఇప్పుడు నేను చెప్పబోయే విషయం లోగడలా మనకు కల్సివచ్చేదో కాదో మరి. కొంప అంటుకు పోతున్న ఈ తరుణంలో ఇంత కంటే గత్యంతరం లేదు. ఊబిలో దిగటం మేలు. సర్వనాశనం కన్నా కొంత నాశనం మంచిది. ......"

చలమయ్య ఉపోద్ఘాతానికి దేవమ్మ చీదరించు కొంది. చిర్రు బుర్రు లాడింది.

ఆ చెప్పే దేదో సూటిగా చెప్పరాదూ సాగదీయక?"

"నీ పిల్లల్ని వర్ణ సంకరం చేయాలి."

"అంటే?"... దేవమ్మ నొసట్లు కుదించుకు పోయాయి.

"కులం తక్కువ గడపలతో మనం వియ్యమందాలి."

చలమయ్య వివరణకు దేవమ్మ ముఖం చండ ప్రచండ మార్తాండ బింబమైంది. మనసు పెట్లి పోయింది. శరీరం ఫెళ ఫెళ లాడింది.

"నాకాగతేం పట్టింది. లక్షణం లాటి సంబంధాలు తెచ్చి లక్షలు పోదుగు చేస్తా చూస్తూ వుండు."

"పిచ్చిదానా, ప్రస్తుతం నాపదవికే బెడద వచ్చింది. ఆసాంతం కొట్టుకొని పోయే సమ

యం దాపురించింది. అట్లా తుడిచి పెట్టుకొని పోక ముందే ఆపద్ధర్మంగా ఏదైనా సరే అవశ్యం మన మాచరించక తప్పదు. నేనొక పథకం ఆలోచించాను. దాన్ని అమలు పర్చే ముందు నీవూ జాగ్రత్తగా వినాలి. నీసహకారమూ ఎంతో కావాలి...."

"అబ్బబ్బ ...... మళ్ళీ సోది ......" దేవమ్మ మరోసారి ఛీ త్కారం చేసింది.

"నేను పదవిలో వుండటం నాకంటే నీకే ఎంతో అవసరం గదూ ? "

"అవసరమని అడుగుతావా ? అదుంటేనే గదా అన్నీ అమిరేది. లేకపోతే నా అవస్థ ఆ పై వాడికి కూడా తెలియదు."

"మరైతే మనకిప్పుడు వర్ణసంకరం తప్పదు గాక తప్పదు" కుండ బద్దలు గొట్టినట్లు చెప్పాడు చలమయ్య.

"దానికీ దీనికీ ముడి పెడ్తావు దేనికి ? "

"అట్లాటి సంబంధాలు చేసుకున్న కుటుంబాలలోని వ్యక్తులకే ఇహ ముందు ముందు పదవి లభించేది."

"ఈ యవ్వారానికి మన పిల్లలే యెందుకు ? ఏ దిక్కూలేని మీ మేనల్లుడు లేడూ; అతగాడిని తీసికొచ్చి మనమే అండగా వుండి, కులం తక్కువ గడపకి ముడిపెడ్దాం. ఏ మంటావ్ ? "

దేవమ్మ సలహాతో చలమయ్య మెదడు నరాలన్నీ కలుక్కు మన్నాయి. నాలుక పిడచ గట్టుకు పోయింది. దేవమ్మ...ఆఫ్ట్రాల్... తన పరువు మీద సవారు జేసే దేవమ్మ కింత యోచనా ? ఇంత యుక్తా ? తనకా ఆలోచనే కలగ నందుకు అల్లాడి పోయాడు. తన రాజకీయ పరిజ్ఞానాన్ని కసితీరా తిట్టి పోసుకున్నాడు చలమయ్య.

"సెహబాష్...భార్యవంటే నీవేభార్యవు. ప్రతి నాయకుడూ నీ వంటి భార్యకు నోచుకొంటే ఇహ పదవి, అనేది దొడ్లో పాడి గేదెలాంటిదే. తరతరాలకూ వడ్డించిన విస్తర్లా వుండి పోతుంది." సంబరంగా అన్నాడు చలమయ్య.

దేవమ్మ ముక్కుపుటాలుబ్బి పోయినై. పెదాలు తిరుగలి రాళ్ళలా అటూ ఇటూ ఊగి పోయినై. సభ సమాప్తమయింది. తల్లి దండ్రుల వాద ప్రతివాదనలకు ప్రేక్షకులు గానే వుండి పోయారు తప్ప, పృచ్ఛకులు కాలేక పోయారు పిల్లలు.

చలమయ్య ఆ వారం రోజులూ కాలికి బలపం కట్టుకొని మేనల్లుడి చుట్టూ తిరిగాడు. ఇంటికి తీసుకొచ్చి, నయానా భయానా నచ్చచెప్పి, మెడ లొంచి వివాహానికి ఒప్పించాడు గూడెంతో రాయబారాలు జరిపించాడు. ఉన్నంతలో కాస్తనదురుగా కన్పించే పిల్లను మేనల్లుడి మెడ కంట గట్టి, మీసం సుతారంగా దువ్వ కొన్నాడు చలమయ్య.

## ద్వితీయ ఘట్టం

ఇప్పటి వరకూ మామూలు కథ. సరళ రేఖపై సాఫీగా ప్రయాణం చేసింది. ఇక్కడ్నుండి అనుకోని మలుపుకు తిరిగింది. ఆ మలుపే చలమయ్య పథకానికి గొడ్డలి పెట్టు పెట్టింది. ఊపిరి సాంతం తోడి వేసింది. అతని ఆశల్ని, కలలు గన్న భవిష్యత్తును నిర్దాక్షిణ్యంగా కాల రాచింది. తన కుటుంబంలో కూడా వర్ణాంతర వివాహం జరిపించి నట్లు, ఇందుగ్గాను వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా తనకు టిక్కెట్టును ఇవ్వవలసిందంటూ అధినేతలకు రాతకూతల ద్వారా తెలియజేశాడు చలమయ్య. అంతటితో ఆగక ఆ మహారథుల చుట్టూ ప్రదక్షిణాలు కూడా ప్రారంభించాడు.

అయితే రాబోయే అధికార రుచి వాసన ఘుమ ఘుమాయించి ముక్కు పుటాల నావ హించి నోరూరిస్తుంటే చలమయ్య మేనల్లుడు మాత్రం యోగనిద్రలో వుంటాడా? ఏదో నాకెందుకులే అన్నట్లూరుకుంటాడా? వర్ణాంతర వివాహం చేసుకొన్న అసలు సిసలైన వ్యక్తిని తానేనని, చలమయ్యకు ఈ విషయంలో ఎటువంటి ప్రమేయం లేదనీ, అందువల్ల అభ్యర్థిగా తననే చెయ్యవలసిందనీ మహారథులకు ఒకవైపు విన్నపం చేసుకుంటానే, మరోవైపు చలమయ్య ప్రతిపక్ష గుడారంతో రాయబారాలు సాగించాడు. పాలిటిక్స్‌లోని మెలకువల్నీ, కీలకాల్నీ ఆకళింపు చేసుకొన్నాడు. ఇందుకు నాందిగా గూడెం వాళ్ళందరినీ తన మాట మీదనే నడిపించ గలిగాడు.

## తృతీయ ఘట్టం

చలమయ్య మేనల్లుడికే అభ్యర్థిగా టిక్కెట్టు లభించింది. చలమయ్య మనసు గానుగలో నువ్వు గింజలా నలిగిపోయింది. ఇదిట్లా వుండగా, తమ గూడెంలోకి చలమయ్య వస్తే, గూడెం గూడెం రాజకీయ కుట్రలకు భగ్గు మంటుందని, అందువల్ల గూడెంలోకి కాలుబెట్టే వీలేలేదని ఆ గూడెం పెద్దలు చలమయ్యకు ఆంక్ష విధించారు. ఆ ఆంక్షతో చలమయ్య సొరచేప వెన్నులాటి కుడిచేయి పడిపోయింది. అడిగినప్పుడల్లా నమ్మకంగా సాలిడ్‌గా లభించే ఓట్లన్నీ జారిపోయినై. కల్పవృక్షం కంటికందనంత దూరం కదిలిపోయింది.

స్వలాభాపేక్షతో ఇటువంటి అవసరార్థ వివాహాలు ముందు ముందు మరెన్ని చలమయ్య అమలుపరుస్తాడోనని తల్లడిల్లిపోయి తమ మధ్య చలమయ్య ఉండడానికి తాము సుతరామూ అంగీకరించమని, చలమయ్య వంటి పయోముఖ విషకుంభాలకూ, తమకూ ఎటువంటి సంబంధ బాంధవ్యాలూ వుండ కూడదనీ. గ్రామపెద్దలు, చలమయ్య బంధువులూ మూకుమ్మడిగా సమావేశమై తీర్మానించారు. ఆ తీర్మానాన్ని వెంటనే అమలు జరిపే నిశ్చయంతో చలమయ్య ఇంటి వైపు సాగిపోయారు.

"మరి గూడెంలోకి రానీయక, గ్రామంలోనూ వుండనీయకపోతే నాకు వేరే స్థానమేదీ వుండేటందుకు ?" ఎదురు ప్రశ్న వేశాడు చలమయ్య.

"మా వెంట వస్తే మేం జూపిస్తాం." సమాధాన మిచ్చారు గ్రామ పెద్దలు.

ముందుజనం, వెనుకచలమయ్య. వీళ్ళని చూస్తూ ఈలలు వేస్తూ రోడ్ల కిరువైపులా గ్రామంలోని మిగిలిన చిన్నా పెద్దా.

గ్రామం దాటారు. పొలిమేరలు దాటారు. "ఇదిగో, ఇదే నీకు తగిన స్థానం" బంజరు భూముల వైపు వేలు బెట్టి చూపించారు గ్రామ పెద్దలు.

చలమయ్య గుండెల్లో పిడుగుల వర్షం. మనసులో మరోసారి ప్రేలిన మందుగుండు గనులు. కళ్ళ ముందు మరేవో చీకటి లోకాలు.

## అంతిమ ఘట్టం

చలమయ్య మేనల్లుడు ఎన్నికల్లో అఖండ విజయం సాధించి అలంకరించివ జీపుపై ఆసీనుడయ్యాడు. ఊరేగింపు ముందుకు కదులుతున్నది. డప్పులు మోతలు, ఎడ తెరిపి లేని జై జై నినాదాలు, పూనకం పట్టిన నాట్యాలు. ఆ ఊరేగింపుకు ఇరువైపులా విసురుతున్న పైసల్ని ఏరుకొనేటందుకు ఆశగా, ఆరాటంతో అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు, చలమయ్య కడగొట్టు సంతానం.

ఎదురుగా సగం చచ్చిపోయిన మేకలా కన్పిస్తున్న చలమయ్యనూ, ఎత్తైనవాహనం మీద పులిలా ఊరేగుతున్న అతని మేనల్లుడినీ కసితీరా శాపనార్థాలు పెడుతూ కూలబడింది దేవమ్మ.

*